నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 11 జూలై 2024 | NIZAMABAD

రిటైర్డ్ సీపీ సంతకం ఫోర్జరీ

■ ఫేక్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇప్పించిన ఇద్దరిపై కేసు

నవీపేట, జూలై 10: ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాలనుకున్న ఓ వ్యక్తి అవసరాన్ని ఆసరాగా తీసుకొని ఏకంగా రిటైర్డ్ సీపీ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్(పీసీసీ) అందజేసి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీపేట మండలం పొతంగల్ గ్రామానికి చెందిన అనిల్ గల్ఫ్ దేశం వెళ్లేందుకు నిజామాబాద్‌లోని ఓ కన్సల్టెంట్ దగ్గర పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం గత నెల దరఖాస్తు చేసుకున్నాడు. అనిల్ అవసరాన్ని ఆసరాగా చేసుకొని రూ.5వేలు తీసుకున్న కన్సల్టెన్సీలో పనిచేసే దినకర్(ఆర్మూర్), ధరిసింగ్(నిజామాబాద్) గతంలో పనిచేసిన సీపీ నాగరాజ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి జూన్ 27న ఫేక్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌కు బదులుగా రిటైర్డ్ సీపీ నాగరాజ్ సంతకంతో పోలీస్ క్లియరెన్స్ బయటికి వచ్చినట్లు స్పెషల్‌బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ పూర్తిస్థాయి విచారణ చేపట్టగా గతంలో పనిచేసిన సీపీ నాగరాజు సంతకాన్ని ఫోర్జరీ చేసి పీసీసీ ఇచ్చినట్లు గుర్తించారు. దీంతో నిందితులు దినకర్, ధరిసింగ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. నిందితులిద్దరూ జిల్లాకు చెందిన పలువురు అమాయకుల వద్ద డబ్బులు దండుకొని ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఐదుగురికి ఫేక్ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇచ్చి డబ్బులు దండుకున్నారని ఎస్సై తెలిపారు.

నవీపేట తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఎడపల్లిలో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు, కారోబార్లు

ఆర్మూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

కొనసాగుతున్న ఆందోళనలు

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలో అంగన్‌వాడీ, పంచాయతీ కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని మండల కేంద్రాల్లో బుధవారం అంగన్‌వాడీ ఉద్యోగులతోపాటు ఆశ వర్కర్లు సైతం ధర్నా చేపట్టారు. బకాయి వేతనాలు చెల్లించాలని, జీవో10ను ఉపసంహరించుకోవాలని, ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వం మారింది..

గౌరవ వేతనం ఆగింది

స్థానిక సంస్థల తాజా మాజీ ప్రజాప్రతినిధుల గౌరవ వేతనం చెల్లింపుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నెలనెలా ఇవ్వాల్సిన గౌరవ వేతనాలు సకాలంలో ఇవ్వలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మూడు నెలలకోసారి వేతనాలు చెల్లించేవారు. ప్రస్తుత ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. పదవీకాలం ముగిసిన ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆరు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు.

– ఎల్లారెడ్డి, జూలై 10

గౌరవ వేతనాలు విడుదల చేయాలి

ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల వేతనాలను వెంటనే విడుదల చేయాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు సంబంధించిన వేతనాలను నేరుగా ఖాతాల్లో వేసింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు నెలలుగా వేతనాలు అందించలేకపోయింది. త్వరలోనే రాష్ట్ర మంత్రిని కలిసి వేతనాలను విడుదల చేయాలని వినతిపత్రం అందిస్తాను.

- ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర జడ్పీటీసీల ఫోరం ప్రధాన కార్యదర్శి, నాగిరెడ్డిపేట

బిల్లుల కోసం ఎదురుచూస్తున్నాం..

గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. గత డిసెంబర్‌లో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు చేశాను. పనులు చేసి ఆరు నెలలు గడిచిపోయినా నేటికీ బిల్లులు చేతికి అందలేదు. అంతేకాకుండా ఎంపీటీసీ సభ్యులకు రావాల్సిన వేతనాలు కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. మా పదవీకాలం ముగిసినా ఆరు నెలల వేతనాలు రావాల్సి ఉన్నది.

-బోధనపు ఇందిరా, ఎంపీటీసీ సభ్యురాలు శెట్పల్లిసంగారెడ్డి

ప్రభుత్వం మారింది, వేతనం ఆగింది..

గత ప్రభుత్వం మారింది, తమ వేతనం ఆగింది. బీఆర్ఎస్ హయాంలో పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులకు నేరుగా ఖాతాల్లో వేతనం డబ్బులు జమ చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ వేతనాలు నేటి వరకూ ఇవ్వలేదు. వేతనాలు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి.

- రాధాబలరాం, మాజీ ఎంపీపీ, గాంధారి

గౌరవ వేతనాల కోసం స్థానిక సంస్థల తాజామాజీ ప్రజాప్రతినిధులు ఎదురుచూస్తున్నారు. ఈ నెల 4న పదవీకాలం ముగియడంతో ఆరు నెలల బకాయిలు ఉన్నాయని వారు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు నెలలకోసారి వేతనాలు వచ్చేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం తమకు గౌరవ వేతనం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 22 మంది జడ్పీటీసీ సభ్యులు, 22 మంది ఎంపీపీలు, 232 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరు ఎన్నికైన సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంపీడీవోల ద్వారా వేతనాలను పంపిణీ చేసింది. ఎంపీడీవోల ద్వారా రెండేండ్లపాటు వేతనాలు అందించిన అప్పటి ప్రభుత్వం అనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు ప్రత్యేకంగా బ్యాంకుల్లో ఖాతాలు తీయించింది. ప్రజాప్రతినిధులు వేతనాల పంపిణీలో అధికారుల మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ఖాతాల్లో జమ చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధుల వేతనాల పంపిణీలో జాప్యం చేస్తున్నది. ప్రభుత్వం ఏడు నెలలు గడిచిపోతున్నా వేతనాలు అందించకపోవడంపై తాజా మాజీ ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పదవీకాలం ముగిసే సమయానికి వేతనాలు వస్తాయని ఆశించిన నాయకులకు నిరాశే ఎదురైంది. జిల్లాలోని ఆయా మండలాల్లో నాయకుల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశాల్లో వేతనాలు రాకపోవడంతోపాటు పదవీకాలంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- పెండింగ్‌లో ఆరు నెలల వేతనాలు
- విడుదలకాని అభివృద్ధి పనుల బిల్లులు
- ఆర్థిక ఇబ్బందుల్లో మాజీ ప్రజాప్రతినిధులు

అభివృద్ధి పనుల బిల్లులూ రాలే..

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం.. అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసింది. నూతనంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కదా తమకు బిల్లులు సకాలంలో వస్తాయి ఆశించిన నాయకులు.. వడ్డీలకు డబ్బులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి ఆరు నెలలు గడిచిపోయినా బిల్లులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సివస్తుంది. పదవీకాలం ముగియడంతో బిల్లుల కోసం, వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

సెలవు కావాలంటే చేయి తడపాల్సిందే..

- ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ నిర్వాకం
- సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

బాన్సువాడ, జూలై 10: టీఎస్ఆర్టీసీ బాన్సువాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) బన్సీలాల్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గత కొంత కాలంగా ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించే డ్రైవర్, కండక్టర్లకు సెలవులు ఇచ్చేందుకు డబ్బులు తీసుకుంటున్నాడని సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు. అసిస్టెంట్ మేనేజర్ బన్సీలాల్ డబ్బులు డిమాండ్ చేసి తీసుకుంటున్నట్లు విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు.

అనుమతిలేని దవాఖానలకు నోటీసులు జారీ చేయాలి

- వైద్యాధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశం

కామారెడ్డి, జూలై 10: అనుమతి లేని ప్రైవేటు దవాఖానలకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ప్రైవేటు దవాఖానల రిజిస్ట్రేషన్లు జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ ద్వారానే ఆమోదించి ఇవ్వాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అథారిటీ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖాన నిర్వాహకులు, వైద్యులు ప్రతినెలా నివేదికలు, రోజువారీ ప్రసవాల వివరాలు, సీజనల్ వ్యాధుల వివరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలన్నారు. సంవత్సరానికి ఒకసారి రిజిస్ట్రేషన్ పొందిన దవాఖానలను సందర్శించాలని సూచించారు. మూడు నెలలకోసారి జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ మీటింగ్ నిర్వహించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసిన డాక్టర్లే దవాఖానను నిర్వహించాలని పేర్కొన్నారు. ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ దరఖాస్తులో నమోదు చేసిన వైద్యులు కాకుండా ఇతర వైద్యులు సేవలందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మగ పిల్లలు పుట్టడానికి మందులు ఇచ్చేవారితోపాటు దవాఖాన యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ అరవింద్ కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు శోభారాణి, శిరీష, వేణుగోపాల్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

బీర్షేబా కంపెనీ కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

బీర్‌షెబా ఆస్తులు సీజ్

కామారెడ్డి, జూలై 10: బీర్‌షెబా కంపెనీపై కేసులతోపాటు అందులో నేరస్తుడైన షేక్ ఇస్మాయిల్ అతని భార్య సమీనా, కుటుంబసభ్యుల పేరిట ఉన్న ఆస్తులను సీజ్ చేశామని పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వివేకానంద కాలనీలో ఉన్న బీర్‌షెబా కంపెనీ ఆఫీసు భవనాన్ని 2020లో సీజ్ చేశామని, కానీ బుధవారం పట్టణానికి చెందిన లాలమ్మల అంజన్‌కుమార్ అనే వ్యక్తి బీర్‌షెబా కంపెనీ ఆఫీసు తాళం తీసి అందులో ఉన్న ఫర్నిచర్, ఇతర వస్తువులను డీసీఎం వ్యాన్‌లో తరలిస్తుండగా స్థానికుల సమాచారంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం విచారణ చేపట్టగా అంజన్‌కుమార్ 2023లో ఇస్మాయిల్ భార్య సమీనా పేరిట ఉన్న ఓపెన్ ప్లాట్ కొనుగోలు చేశాడని, ఆ ప్లాట్ సైతం 2020లోనే పోలీసులు సీజ్ చేసినట్లు తెలిపారు. విషయం తెలిసి కూడా అంజన్‌కుమార్ ప్లాట్‌తోసహా ఉన్న ఇంటిని కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. సీజ్ చేసిన ఇంటిని కొనుగోలు చేయడమే కాకుండా అందులోని వస్తువులను దొంగతనంగా తీసుకెళ్తున్న అంజన్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, ఇంటిని సీజ్ చేశామన్నారు. బీర్‌షెబా కేసులో సీజ్ చేసిన స్థిర, చరాస్తులను ఎవరూ కొనుగోలు చేయొద్దని, షేక్ ఇస్మాయిల్, అతని కుటుంబ సభ్యులపై ఉన్న ఆస్తులను కొనుగోలు చేయొద్దని, ఎవరైనా కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మధ్యాహ్నం 2గంటలకే తాళం వేసిన దృశ్యం

ఒకే తరగతి ఉండి, క్లాస్ కొనసాగుతుండడంతో గది బయట నిరీక్షిస్తున్న అధ్యాపకురాలు

2 గంటలకే కళాశాలకు తాళం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కృషి చేస్తుంటే.. ఇక్కడ మాత్రం మొదటిసారి ప్రారంభమైన కళాశాలను పట్టించుకున్న నాథుడే లేడు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కనీస కృషి కూడా జరగడం లేదు. వసతులు, సౌకర్యాలు కల్పిస్తూనే అధ్యాపకుల కొరత లేకుండా చూడాల్సిన అధికారులు నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

– నాగిరెడ్డిపేట, జూలై 10

నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహణపై అధికారుల తీరు మారడం లేదు. కళాశాల మంజూరై..ఎనిమిది నెలలు కావొస్తున్నా కన్నెత్తి చూడడం లేదు. ఒక్క అధ్యాపకుడితో కళాశాల కొనసాగుతుండగా రెండు రోజుల క్రితం డిప్యుటేషన్‌పై ఇద్దరు అధ్యాపకులను పంపించి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగాలంటే..కనీసం 250 మంది విద్యార్థులు ఉండాల్సి ఉంటుంది. కానీ ఇక్కడి ప్రిన్సిపాల్ హేమచందర్ నిర్లక్ష్యంతో పట్టుమని 50మంది విద్యార్థులు కూడా చేరలేదు. ముందే కోఎడ్యుకేషన్ కళాశాల. కనీస వసతులు, ఎలాంటి సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ' కళాశాలను సందర్శించగా 13 మంది విద్యార్థులు, ఒక్క అధ్యాపకుడు నాగయ్య ఫిజిక్స్ లెసన్ ముగించుకొని వెళ్లిపోయాడు. ఉదయం 11 గంటలకు మరో ఇద్దరు అధ్యాపకులు రాములు (ఇంగ్లిష్), రాధ (సివిక్స్) తమ లెసన్ పూర్తి చేసుకొని కళాశాలకు తాళం వేసి వెళ్లిపోయారు. మధ్యాహ్నం ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలలో తమకు విధులు ఉన్నాయంటూ తాళం వేసి వెళ్తున్నారు. ఇదే తీరు కొనసాగితే నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాల తిరిగి వెనక్కి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కళాశాలలో అధ్యాపకులు, వసతుల కల్పనకు కృషి చేయాలని మండల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

పన్నెండు మందికి ఒక్కరు కూడా లేరు

నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఆంగ్ల భాషల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 50మంది మాత్రమే ప్రవేశం పొందారు. మంగళవారం వరకు కేవలం ఐదుగురు విద్యార్థులు హాజరుకాగా, బుధవారం 13మం ది హాజరయ్యారు. డిప్యుటేషన్‌పై కళాశాలకు ముగ్గురు అధ్యాపకులు వస్తుండగా వారు సైతం ఇక్కడ ఒక సబ్జెక్ట్ చెప్పుకొని ఎల్లారెడ్డికి వెళ్తున్నారు. అన్ని కోర్సులకు 12మంది అధ్యాపకులు ఉండాలి. కానీ ఒక్క అధ్యాపకుడిని కూడా నియమించలేదు. ఒకే తరగతి గది ఉండడంతో ఒకరు బోధిస్తున్న సమయంలో మరొకరు బయట నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

- కన్నెత్తి చూడని ప్రిన్సిపాల్
- డిప్యుటేషన్‌పై ముగ్గురు అధ్యాపకులు
- నాగిరెడ్డిపేట ప్రభుత్వ కళాశాల నిర్వహణపై నిర్లక్ష్యం

వసతులు కల్పించాలి..

కళాశాలలో సౌకర్యాలు, వసతులు కల్పిస్తేనే విద్యార్థులు చదువుకొనే అవకాశం ఉంటుంది. ఇక్కడికి వచ్చి జాయిన్ అయిన విద్యార్థులకు ఇబ్బందులు ఉండడంతో మరుసటి రోజు రావడం లేదు. పూర్తిస్థాయిలో అధ్యాపకులు ఉంటే బాగుంటుంది. విద్యార్థులు పూర్తిస్థాయిలో చేరితేనే ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సహకరించాలి.

- నాగయ్య, ఫిజిక్స్ అధ్యాపకుడు

వసతులు, సౌకర్యాలు కల్పించాలి

కళాశాలలో ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేవు. ఒక గది మాత్రమే ఉన్నది. అన్ని సబ్జెక్టుల వారిని ఒకే దగ్గర కూర్చోబెట్టి బోధిస్తున్నారు. కేవలం ఇంగ్లిష్, ఫిజిక్స్, సివిక్స్ సబ్జెక్టులు మాత్రమే చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఇంటికి వెళ్తున్నాం. పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించాలి.

- ఉదయ్‌కిరణ్, ఎంపీసీ, ఫస్టియర్